క్లుప్తంగా

నేడు దిమ్మగుడిలో 'జగనన్న సురక్ష'

పెద్దవడుగూరు: దిమ్మగుడి గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగభూషణ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. మండల స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

గార్లదిన్నె: మర్తాడు గ్రామ సచివాలయం –1,2లో గురువారం ఉదయం 9.30 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న తెలిపారు. ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తామన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలోని బెంచికొట్టాల రోడ్‌లో అమృత్ ఫేజ్–2 కింద జరుగుతున్న పైప్‌లైన్ ఏర్పాటు పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పరిశీలించారు. పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను త్వరితగతిన పూర్తి చేయించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. డీఈ హేమచంద్ర, వాటర్‌వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న చిన్న కామక్క

గుత్తి: జక్కల చెరువు గ్రామానికి చెందిన చిన్న రామక్క అనే మహిళ బుధవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నార్పలకు కొత్త 108 వాహనం



వాహనాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

నార్పల: మండల ప్రజల అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం నూతన 108 వాహనాన్ని ఏర్పాటు చేసింది. వాహనాన్ని జిల్లా 108 మేనేజర్ సంజీవరెడ్డి, డీఎఫ్ఎం యుగంధర్ బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు నూతన 108 వాహనం ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సాదియా, ప్రవీణ్, 108 అధికారులు రాజశేఖర్, విజయ్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కార్యాలయంలో వికలాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సుమారు 50 వికలాంగులకు ఒక్కొక్కరికి రూ.500 విలువ చేసే సరుకులను పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సుబ్రహమణ్యం, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సతీమణి కన్నుమూత



రాధమ్మ(ఫైల్)

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత డాక్టర్ అమరనాథ్ రెడ్డి సతీమణి రాధమ్మ(67) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. సమాచారం అందుకున్న అన్ని రాజకీయ పార్టీ నాయకులు బుధవారం డాక్టర్ అమరనాథ్‌రెడ్డి నివాసానికి చేరుకుని రాధమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. డాక్టర్ అమరనాథ్ రెడ్డి, ఆయన కుమారుడు మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డికి సంతాపం తెలియజేశారు. సాయంత్రం వారి స్వగ్రామమైన శింగనమల మండలం తరిమెలలో రాధమ్మకు అంత్యక్రియలు నిర్వహించారు.

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



మహిళకు ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న చైర్‌పర్సన్ భవాని

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకొచ్చారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నందలపాడులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 11 రకాల సేవలను ఉచితంగా అందించే వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. తాము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని మున్సిపల్ చైర్మన్ జేసీ కుళ్లు రాజకీయాలకు పాల్పడుతున్నాడని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నపుడు స్పర్శ అనే సంస్థను అడ్డుపెట్టుకుని మున్సిపాలిటీని దోచుకోవడమే కాకుండా డీజిల్ కుంభకోణానికి పాల్పడ్డాడని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ.2.30 కోట్లతో గండికోట నుంచి తాగునీటి పైప్‌లైన్ నిర్మించామన్నారు. మున్సిపాలిటీలో జరిగిన అవకతవకలపై విచారణ కోరే దమ్ము జేసీకి ఉందా అని ప్రశ్నించారు. జేసీ సోదరులు ఆఖరుకు చికెన్ వ్యాపారస్థులతో కుమ్మక్కై దోచుకుంటున్నారని ఆరోపించారు. తాడిపత్రిలో మట్కా నడుస్తుందంటే జేసీ సోదరుల చలువేనని ఎద్దేవా చేశారు. వార్డు పర్యటనకు వచ్చిన జేసి ప్రభాకర్‌రెడ్డి తమ మున్సిపాలిటీలో చెత్త ఊడిచే ఉద్యోగం ఇస్తాను చేస్తావా అంటూ విద్యార్థినులను అవమానపరిచేలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మున్సిపల్ కమిషనర్ జి.రవి, సీఎస్‌డీటీ రాజా, మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్య, టిపిఆర్వో సతీష్, సిబ్బంది చాంద్‌బాషా, కౌన్సిలర్లు రుపా, రాఘవేంద్రప్రసాద్, నాయకులు పేరం ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సునీల్ ,అలీ నాగూర్ షరీఫా యాదవ్, బాలరాజు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అందరికీ న్యాయం

గుంతకల్లుటౌన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని తెలిపారు. బుధవారం పట్టణంలోని 2,17,30 వార్డు సచివాలయాల పరిధిలో ఆయా వార్డు కౌన్సిలర్లు మెహరున్నీసా, కె.వి.నాగరత్న, చాముండేశ్వరి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష శిబిరాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అర్హులైన వారికి 11 రకాల ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కెఎస్.లావణ్య, ఆర్ఓ నాసిర్‌హుసేన్, టీపీఎస్ అబ్దుల్ సత్తార్, మెప్మా టీపీఆర్ఓ మోహన్, సీఎంఎం.భవానీ, వార్డు సచివాలయాల పట్టణ కన్వీనర్ జింకల రామాంజనేయులు, వార్డు ఇన్‌చార్జ్‌లు పీఎస్.మస్తాన్, కెవి.వాసు, హరి పాల్గొన్నారు.

యల్లనూరు: పెద్దమల్లేపల్లి గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండలస్పెషలాఫీసరు ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. ఈసందర్భంగా 191 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందించామని స్పెషలాఫీసరు తెలిపారు. జెడ్పీటీసీ భోగతి విజయ ప్రతాప్‌రెడ్డి, సర్పంచులు అజ్జుగుట్టు రామాంజుల రెడ్డి, విజయలక్ష్మి, అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, ఏఓ రామకృష్ణుడు డిప్యూటీ డీటీ శ్వేత, ఏపీఎం ముత్యాలప్ప, నాయకులు పీఎం కొండాపురం మునిస్వామి నాయుడు, పెద్దమల్లేపల్లి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: దోనిముక్కల, నాగసముద్రం గ్రామ సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు ఆయా గ్రామాల్లో 290 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. స్పెషలాఫీసర్ మధుసూదన్‌రావు, ఎంపీడీఓ వెంకటరమణప్ప, ఈవోఆర్డీ బారన్ సాహెబ్ పాల్గొనారు.

నార్పల: బొందలవాడ, నడిమిదొడ్డి సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో 651 మందికి ధ్రువపత్రాలను మండల ప్రత్యేక అధికారి మహమ్మద్ రఫీ అందించారు. సర్పంచు నాగలక్ష్మమ్మ, నాయకులు లక్ష్మిరెడ్డి, మునిరెడ్డి, రామయ్య, తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంఈఓ కృష్ణయ్య, ఈఓఆర్డీ లక్ష్మి నరసింహ, ఏపీఎం తిప్పమ్మ పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: అమ్మలదిన్నెలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అధికారులు పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీడీఓ రామకృష్ణ, తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఈఓఆర్డీ కమలబాయ్, సర్పంచు గౌతమి, వైఎస్సార్ సీపీ నేత రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: చెన్నంపల్లి, నీలాంపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు సర్టిఫికెట్లను మంజూరు చేశారు. ఎంపీపీ సునీత, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ గువ్వల రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, నీలాంపల్లి సర్పంచ్ రసూల్‌బీ, ఎంపీటీసీ అంజన్‌రెడ్డి, ఈఓఆర్‌డీ దామోదరమ్మ, పంచాయతీ సెక్రటరీలు శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

పామిడి: వంకరాజుకాలువ సచివాలయంలో సర్పంచ్ తలారి లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురికి ధ్రువపత్రాలు అందించారు. వైఎస్సార్‌సీపీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ రఘునాథ్‌కుమార్ దత్తు, జోజోడే కుమార్, మండల స్పెషలాఫీసర్ అప్పాజీ, డీటీ జీ లక్ష్మీనారాయణరెడ్డి, ఈఓఆర్డీ బీవీ శశికళ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

• ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. కసాపురంలోని 122 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాన్ని బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లులేని ప్రతి పేదవాడికి సొంత ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత భారీ ఎత్తున ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది లేదని తెలిపారు. గతంలో ఏ చిన్న పని జరగాలన్నా అధికారులు, ప్రభుత్వ కార్యాలయాలు, నాయకుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా పని జరగక లంచాలు ముట్టజెప్పాల్సి వచ్చేదని, కానీ తమ ప్రభుత్వం వచ్చాక లంచగొండి తనాన్ని పూర్తిగా తుడిచిపెట్టేశారని తెలిపారు. పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇళ్లవద్దకే చేరుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కరోనా కారణంగా అభివృద్ధి కొంతమేర నిలిచిపోయిందని, లేనిపక్షంలో ప్రతి నియోజకవర్గంలోనూ పరిశ్రమలు వచ్చేవన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయకేతనం ఎగురవేస్తుందని అప్పుడు పరిశ్రమలు ఏర్పాటు చేసి ఎక్కడ చదివిన విద్యార్థులకు అక్కడే ఉద్యోగాలు కూడా కల్పిస్తామని తెలిపారు. ఎంపీడీఓ వెంకటరమణప్ప, ఎంపీపీ బీవీ మాధవి, వైస్ ఎంపీపీ ప్రభావతి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, సర్పంచ్ రాయల్ అనిత, ఎంపీటీసీ జ్యోతి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్ రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, మాజీ ఎంపీటీసీ వెంకటరాముడు, హౌసింగ్ ఏఈ సంపత్ కుమార్, మండల కన్వీనర్ మోహన్‌రావు, సచివాలయ మండల కన్వీనర్ గోవిందు నాయక్, మాజీ ఎంపీటీసీ జయరామిరెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు వినోద్‌కుమార్‌రెడ్డి, వంశీ యాదవ్, గంతుల రామాంజనేయులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోండి



తాడిపత్రి అర్బన్: మోడల్ స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

తాడిపత్రి అర్బన్: టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్‌ల పేరుతో అధిక ఫీజు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని పాఠశాలలను బంద్ చేయించారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాగ్ కన్వీనర్ భూపాల్‌రెడ్డి, నగర కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షుడు మనోజ్, నాయకులు సాయి కార్తీక్, మంజు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఏబీవీపీ నాయకులు పాఠశాలలను మూసివేయించారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి శివరాజ్ తెలిపారు. నాయకులు నాగేంద్ర, వంశీ, అక్షయ్, వాసీమ్, అనిల్,హనీఫ్, సంతోష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల రోడ్డులోని 12వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. వార్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద వీధుల్లోకి తాగునీటి సరఫరా పైపులైన్లు లేకపోవడంతో చాలా దూరం నుంచి తామే పైపు లైను వేసుకొని తాగునీటిని తెచ్చుకుంటున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే అక్కడున్న మున్సిపల్ అధికారులతో మాట్లాడి తాగునీటి సరఫరా పైపు లైను వేసేందేకు వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. సీసీరోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం కేవలం ప్రకటనలకు, ఆర్భాటాలకే పరిమితమైందని ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, చెప్పినవన్నీ చేసిందని ఎమ్మెల్యే పెద్దారెడ్డి వివరించారు. నాలుగేళ్లలో దేవుడి దయ, మీ అందరి చల్లని ఆశీస్సులతో మంచి చేశామని ఇక ముందు కూడా మంచి చేస్తామని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కౌన్సిలర్లు రంగనాథరెడ్డి, రాఘవేంద్ర, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి, నాయకులు సూర్యప్రభాకర్‌బాబు, డివి.కుమార్, బాబయ్య, బట్టా రాజా, రఘునాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మస్తాన్‌వలి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైళ్లను పునరుద్ధరించాలని ఆందోళన

గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్‌లో ఆగకుండా వెళుతున్న రైళ్లను ఆపాలని, దారి మళ్లించిన పలు రైళ్లను కూడా తిరిగి గుత్తి మీదనే నడపాలని డిమాండ్ చేస్తూ గుత్తి రైల్వే జంక్షన్ పరిరక్షణ సమితి జేఏసీ చైర్మన్ జీఎం బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం రైల్వే స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. జీఎం బాషా మాట్లాడుతూ గతంలో గుత్తి రైల్వే స్టేషన్ మీదగా తిరిగే పలు రైళ్లను దారి మళ్లించడం, మరి కొన్నింటిని ఆపకుండా చేశారన్నారు. దీంతో రైల్వే ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్టేషన్ మేనేజర్‌కు అందజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా నాయకులు కెఎం రంగనాయకులు, నిర్మలారెడ్డి, మహ్మద్, వీరా, బాబు, లింగారెడ్డి, తిరుమల రావు, శ్రీనివాసులు

వ్యక్తి మృతి

పెద్దవడుగూరు : ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. గుత్తిఅనంతపురం గ్రామానికి చెందిన పుంజా వెంకట్రాముడు(34)కు 12 ఏళ్లక్రితం పెద్దవడుగూరుకు చెందిన లక్ష్మీదేవి వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్య అనారోగ్యంతో మృతి చెందింది. తర్వాత గుత్తి మండలం కొత్తపల్లికి చెందిన రామలక్ష్మీతో పెళ్లి జరిగింది. ఆమెకు క్యాన్సర్ సోకడంతో రెండేళ్ల క్రితం మరణించింది. వీరికి ఇద్దరు కుమార్తలున్నారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురై ఈనెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో డోజీ మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత అనంతపురం తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ- సెట్‌లో తాడిపత్రి విద్యార్థుల ప్రతిభ

తాడిపత్రి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఈ- సెట్ 2023 ఫలితాల్లో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ బుధవారం తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థి ఎన్. పవన్‌కుమార్ రాష్ట్ర స్థాయిలో 14వ, అదే విభాగంలో ఐదుగురు, ఎలక్ట్రానిక్స్ విభాగం నుంచి ఐదుగురు, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి ఐదుగురు చొప్పున వెయ్యిలోపు ర్యాంకులు సాధించారన్నారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. హెచ్ఓడీలు వీరాస్వామి, కార్తికేయ శర్మ, మద్దయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాడికి: గంగాదేవిపల్లెకు చెందిన లక్ష్మీనారాయణ ట్రాక్టర్‌లో తాడిపత్రి మండలం పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వేములపాడు రహదారిలో బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేశామన్నారు.

బాలుడిపై కుక్క దాడి

గుత్తి: కొత్తపేట గ్రామంలో మూడేళ్ల బాలుడిపై బుధవారం కుక్క దాడి చేసింది. వివరాలు.. గ్రామానికి చెందిన దగ్గు ఖాన్, షాహీనా దంపతుల కుమారుడు ఇజాజ్ ఇంటి ముందు ఆడుకుంటుండగా ఓ కుక్క వచ్చి దాడి చేసి కరిచింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని మన్రో సత్రం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ నేతకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..బసినేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీరాములు బైక్‌లో గుత్తికి బయలు దేరాడు. అయితే మన్రో సత్రం వద్ద ఎదురుగా ఎద్దుల బండి బైక్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: కోన రోడ్డులోని కొండ వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని బుధవారం సాయం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.3,400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుత్తి: ధర్మాపురం, కరిడికొండ గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. కార్యక్రమానికి గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

శింగనమల: చిన్నమట్లగొందిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

జాబ్‌మేళాలో 74 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

గుంతకల్లు రూరల్: పట్టణంలోని శ్రీశంకరానంద గిరి డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన జాబ్‌మేళాలో 74 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. టెక్ మహేంద్ర కంపెనీ ఆధ్వర్యంలో(ఈ కామర్స్, ఈ బ్యాంకింగ్, బ్యాంకింగ్, టెలికాం విభాగాలు) నిర్వహించిన జాబ్‌మేళాలో 275 మంది విద్యార్థులు పాల్గొనగా 74 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఉద్యోగాలు పొందిన వారిలో 40 మంది తమ కళాశాల విద్యార్థులున్నారని తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కరస్పాండెంట్ కేసీ హరి, ప్రిన్సిపాల్ గోపాల్ అభినందించారు.

పార్కు పనులు పూర్తి చేయండి

తాడిపత్రి: పార్కులో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం ఆయన సజ్జలదిన్నె గ్రామ సమీపంలోని పాత పెన్నా వంతెన వద్ద పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు. దాదాపు 90 శాతం మేర పనులు పూర్తయ్యాయని, వ్యాయామ పరికరాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తామని కాంట్రాక్టర్ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ నెల 8న వైఎస్సార్ జయంతి రోజున పార్కుతోపాటు వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో బీకేఎస్ విద్యార్థిని ప్రతిభ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కీర్తన అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. గత నెల 29 నుంచి ఈ నెల 2 వరకు ఏలూరు జిల్లా నూజివీడులో అంతర్ జిల్లాల అండర్–18 జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయన్నారు. ఇందులో కీర్తన అనంతపురం జిల్లా జట్టు తృతీయ స్థానం సాధిండంలో కీలకపాత్ర పోషించిందన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

పెద్దపప్పూరు: వరదాయపల్లిలోని మసీదు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆవిష్కరించనున్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

నేడు యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్

గుత్తి: పట్టణంలోని పశు వైద్య శాలలో జూనోసిస్ డే సందర్భంగా గురువారం ఉచితంగా కుక్కలకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాల(వ్యాక్సిన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏడీ డాక్టర్ భారతి బుధవారం తెలిపారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

జేసీ.... నువ్వా నీతులు చెప్పేది?

• నాటి అరాచకాలు మరిచావా?
• శవ రాజకీయాలు మానుకో..
• జేసీకి వైఎస్సార్‌సీపీ నేత ఫయాజ్‌బాషా హితవు



మాట్లాడుతున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని చేసిన అరాచకాలు మరిచావా...ఈరోజు నువ్వా నీతులు చెప్పేది అంటూ వైఎస్సార్‌సీపీ నేత హీరాపురం ఫయాజ్‌బాషా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై మండిపడ్డారు. బుధవారం రాత్రి తన కార్యాలయంలో ఫయాజ్‌బాషా విలేకరులతో మాట్లాడారు. 1996 టౌన్‌బ్యాంకు ఎన్నికల సందర్భంగా మెయిన్ బజార్‌లోని ఆంధ్రాబ్యాంకు ముందు లక్ష్మీనారాయణ అనే వ్యక్తిని స్వయంగా కొడవలితో దాడి చేసి హత్య చేసిన విషయాన్ని మరిచావా..తనపై ఎవరు దాడి చేశారో కూడా మృతుడు లక్ష్మీనారాయణ అప్పట్లో మెజిస్ట్రేట్ ముందు మరణవాంగ్మూలం ఇచ్చిన ప్రజలకు తెలియదనుకుంటున్నావా అని ప్రశ్నించారు. 1993 నుంచి 2014 వరకు తనపై 36 అక్రమ కేసులు బనాయించింది నీవు కాదా, 2006 సిద్ద బాషా దర్గా అల్లర్ల సమయంలో ఒకే రోజు 14 అక్రమ కేసులు బనాయించలేదా అన్నారు. తన సోదరుడు అప్పటి వక్ఫ్‌బోర్డు చైర్మన్ అయిన జాకీర్‌హుసేన్‌ను కిడ్నాప్ చేయించలేదా అని ప్రశ్నించారు. 1991లో రాజీవ్‌గాంధీ హత్యానంతరం తన 5వ నంబర్ బీడీ ఫ్యాక్టరీని దహనం చేయలేదా? 2006 తన గ్రానైట్, నాపరాళ్ల పరిశ్రమలను ధ్వంసం చేసిన ఘటనలు మరిచావా అంటూ ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయాక దిక్కుతోచక ఇప్పుడు శవ రాజకీయాలకు పాల్పడుతున్నావంటూ మండిపడ్డారు. ఒక పోలీసు అధికారి చనిపోతే అతని మృతదేహానికి నివాళులర్పించాల్సింది పోయి శవరాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. తాను డీఎస్పీ కార్యాలయానికి వెళ్లానని జేసీ పదేపదే చెబుతున్నాడని, అదేమైనా నిషేధిత స్థలమా అని ప్రశ్నించారు. జేసీ అధికారంలో ఉన్నప్పుడు టీపీఓ షబ్బీర్‌పై ఒత్తిడి తెచ్చి అతడి మృతి కారణం కాలేదా అని నిలదీశారు. ఇప్పటికైనా జేసీ సభ్యత, సంస్కారం నేర్చుకోవాలని ఫయాజ్ హితవుపలికారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

బుక్కరాయసముద్రం: స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు కింద వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతపురం అక్షర్ ఐ హాస్పిటల్ వైద్యులు 315 మంది వృద్ధులకు పరీక్షలు చేపట్టారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ జిల్లా నోడల్ అధికారి కిరణ్ కుమార్‌రెడ్డి శిబిరాన్ని పరిశీలించారు. కంటి పరీక్షలతోపాటు అవసరమైన వారికి కంటిఅద్దాలు, ఆపరేషన్లు ఉచితంగా అందేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ రమీజా, ఫాతిమా, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. అనంతపురం మాల్వినా కంటిఆసుపత్రి వైద్యులు 26 మంది వృద్ధులకు ఉంటి పరీక్షలు నిర్వహించి ఆరుగురిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వైద్యాధికారి ఎల్లప్ప, అప్తాలమిక్ అసిస్టెంట్ విశాల, హెడ్‌నర్స్ శివకుమారి పాల్గొన్నారు.